శ్రీరాముడి నుదిటిపై సూర్యకిరణాలు

ములుగు జిల్లా ఏటూరునాగారం లోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఉదయం విగ్రహ మూర్తులను అలంకరించిన తరువాత సూర్యకిరణాలు నేరుగా శ్రీరామచంద్రమూర్తి విగ్రహం నుదిటిపై పడినట్టు అర్చకులు తెలిపారు. ఈ అరుదైన దృశ్యాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.
- ఏటూరునాగారం

ఆర్థిక ఇబ్బందులతో అర్చకుడి ఆత్మహత్య

మార్త ఓంప్రకాశ్ (ఫైల్)

కాశీబుగ్గ, ఏప్రిల్ 19: ఆర్థిక ఇబ్బందులతో అర్చకుడు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన వరంగల్ నగరంలో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానిక ఎస్సార్ నగర్‌కు చెందిన మార్త ఓంప్రకాశ్ (38) కాశీబుగ్గలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో అర్చకుడిగా పని చేశారు. ప్రస్తుతం మొగిలిచర్లలోని శివాలయంలో అర్చకుడిగా సేవలందిస్తున్నారు. వచ్చే జీతం కుటుంబ అవసరాలకు సరిపోకపోవడంతో ఇంట్లో గొడవలయ్యేవి. దీంతో మనస్తాపానికి గురైన ఆయన శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకొని అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

టెయిల్‌పాండ్ నుంచి కృష్ణాడెల్టాకు 4 టీఎంసీలు

తరలించుకుపోయిన ఆంధ్రా అధికారులు ● ప్రాజెక్టులో మిగిలింది 2.9 టీఎంసీల నీరే

కేసీఆర్ హయాంలో చుక్కనీరూ పోలే ● మిషన్ భగీరథకు పాంచి ఉన్న నీటి కొరత



టెయిల్‌పాండ్ నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో జలాశయంలో తగ్గిన నీరు

దామరచర్ల, ఏప్రిల్ 19: నాగార్జునసాగర్ ప్రాజెక్టు దిగువన నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం చిట్యాల వద్ద నిర్మించిన టెయిల్‌పాండ్ ప్రాజెక్ట్ నుంచి నాలుగు టీఎంసీల నీటిని ఆంధ్రా అధికారులు తరలించుకుపోయారు. ఈ నెల 15 నుంచి వరుసగా మూడు రోజుల పాటు టెయిల్‌పాండ్ నుంచి దిగువన ఉన్న పులిచింతల ప్రాజెక్ట్‌కు నీటిని విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తాగునీటి కోసమే నీటిని విడుదల చేసినట్టు అధికారులు చెప్తున్నారు. ఇప్పటికే సాగర్ కుడికాల్వ ద్వారా మూడుసార్లు నీటిని విడుదల చేసిన ఆంధ్రా అధికారులు ప్రస్తుతం టెయిల్‌పాండ్ నుంచీ నీటిని విడుదల చేసుకున్నారు.

నీటి నిల్వకే టెయిల్‌పాండ్

నాగార్జున సాగర్‌లో విద్యుదుత్పత్తి కోసం వాడిన నీరు దిగువకు పోకుండా నిల్వ చేసేందుకు డ్యాం నుంచి 21 కిలోమీటర్ల దూరంలో చిట్యాల వద్ద కృష్ణానదిపై టెయిల్‌పాండ్ ప్రాజెక్ట్ నిర్మించారు. సాగర్‌లో విద్యుదుత్పత్తి ద్వారా విడుదలైన నీటిని ప్రాజెక్టులో నిల్వచేసి రివర్స్ టర్బైన్ల ద్వారా తిరిగి సాగర్ జలాశయంలోకి పంపిస్తున్నారు. ఈ ఏడాది సాగర్‌లో తగినంత నీరులేక పోవడంతో జలవిద్యుదుత్పత్తిని నిలిపివేశారు. సాగర్ ప్రాజెక్ట్ దిగువ నుంచి టెయిల్‌పాండ్ వరకు 21 కిలోమీటర్ల మేర నిత్యం 7 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎన్నడూ ఈ నీటిని విడుదల చేయలేదు. సాగర్‌కు వరద నీరు అధికంగా వచ్చినప్పుడు మాత్రమే నీటిని దిగువకు వదిలేవారు.

నీటి కేటాయింపులు ఇలా

కృష్ణాబేసిన్‌లో తీవ్ర నీటిఎద్దడి నెలకొన్న క్రమంలో కేఆర్‌ఎంబీ ఆధ్వర్యంలో ఇటీవల ఏపీ, తెలంగాణ ఈఎన్‌సీలు సమావేశమయ్యారు. నాగార్జునసాగర్ జలాశయంలో 500 అడుగులకు పైన ఉన్న 14 టీఎంసీల నీటిని తాగునీటి కోసం వాడుకోవాలని, ఇందులో తెలంగాణకు 8.5 టీఎంసీలు, ఆంధ్రాకు 5.5 టీఎంసీలను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కేఆర్‌ఎంబీ కేటాయింపుల మేరకే టెయిల్‌పాండ్‌లోని నీటిని వాడుకున్నట్టు ఆంధ్రా అధికారులు చెప్తున్నారు. సాగర్ జలాశయంలోని 14 టీఎంసీల నీటి విషయంలోనే పంపకాలు జరిగినప్పుడు దిగువన టెయిల్‌పాండ్‌లో నిల్వ ఉన్న నీటికి ఈ కేటాయింపులు ఎలా వర్తిస్తాయని తెలంగాణ వాదులు ప్రశ్నిస్తున్నారు.

మిషన్ భగీరథకు నీటిగండం

టెయిల్‌పాండ్ బ్యాక్ వాటర్ వద్ద తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ ప్రాజెక్ట్ మెయిన్ పంప్‌హౌస్‌ను నిర్మించింది. ఇక్కడి నుంచి నీటిని తీసుకొని శుద్ధిచేసి నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట నియోజక వర్గాల్లోని 510 గ్రామాల్లోని ప్రతి ఇంటికీ తాగునీటిని అందిస్తున్నది. ప్రస్తుతం ఆంధ్రా అధికారులు టెయిల్‌పాండ్ జలాశయం నుంచి 4 టీఎంసీల నీటిని తరలించుకు పోవడం వల్ల ప్రాజెక్టులో 2.9 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఆంధ్రా అధికారులు మరోమారు ప్రాజెక్ట్ నుంచి నీటిని తరలించుకుపోతే మిషన్ భగీరథకు ఇబ్బందులు తప్పవు. టెయిల్‌పాండ్ నుంచి ఆంధ్రా అధికారులు నీటిని దిగువకు విడుదల చేసిన సమాచారం అందడంతో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, సంబంధిత అధికారులు గురువారం చిట్యాల వద్ద కృష్ణానదిపై ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. జలాశయంలో నీరు తగ్గిపోవడంతో పంప్‌హౌస్ వద్ద నదిలో ఏర్పాటు చేసిన అదనపు మోటార్లను నదిలోకి దింపారు.

పాతకథ పునరావృతం

గతంలో సమైక్య రాష్ట్రంలో నాగార్జున సాగర్ నుంచి ఆంధ్రాకు ఇష్టారీతిన నీటిని తరలించుకుపోయారు. సాగర్‌లో విద్యుదుత్పత్తి కోసం వినియోగించిన నీటిని రివర్సబుల్ పంపింగ్ ద్వారా తిరిగి సాగర్ జలాశయంలోకి పంపాలనే నిబంధన ఉన్నా పట్టించుకోకుండా నీటిని దిగువన ఉన్న కృష్ణాడెల్టాకు తీసుకెళ్లేవారు. టెయిల్‌పాండ్ నిర్మాణం తర్వాత కూడా ఇదే తంతు కొనసాగింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ ప్రభుత్వం విద్యుదుత్పత్తి ద్వారా విడుదలైన నీటిని టెయిల్‌పాండ్ వద్ద నిల్వ చేసింది. అవసరమైన సందర్భాల్లో రివర్సబుల్ పంపింగ్ ద్వారా సాగర్ జలాశయంలోకి తరలించింది. తొమ్మిదిన్నరేండ్లపాటు చుక్కనీటిని కూడా దిగువకు వదల్లేదు. ప్రభుత్వం మారిన నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ సర్కారుకు తిరిగి పాతకథ మొదలుపెట్టడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కూకట్‌పల్లి నుంచి సనత్‌నగర్‌కు రాధాకిషన్‌రావు కేసు బదిలీ

అమీర్‌పేట, ఏప్రిల్ 19: హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావుపై కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును శుక్రవారం సనత్‌నగర్ పీఎస్‌కు బదిలీ చేశారు. వివరాలల్లోకెళితే.. కూకట్‌పల్లి విజయ్‌నగర్ కాలనీలో నివసిస్తున్న సుదర్శన్, సనత్‌నగర్‌కు చెందిన రాజా, విశ్వనాథరాజు కలిసి 2017లో జెక్‌కాల నీలో ఓ అపార్ట్‌మెంట్‌ను డెవలప్‌మెంట్ చేశారు. అందులో సుదర్శన్ తన వాటా కింద ఓ ఫ్లాట్‌ను తీసుకున్నాడు. కానీ, వ్యాపారంలో నష్టం రావడంతో రూ.5 లక్షలు అదనంగా ఇవ్వాలని రాజా, విశ్వనాథరాజు డిమాండ్ చేశారు. అందుకు సుదర్శన్ నిరాకరించడంతో వారు అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పోలీసులు తనను టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తీసుకెళ్లి నిర్బంధించి కొట్టారని సుదర్శన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాధాకిషన్‌రావుపై కేసు నమోదైంది.

నీటి చౌర్యంపై సర్కారు జవాబేదీ?

- టెయిల్‌పాండ్ నీటిని దోచుకుపోతున్నరు
- ప్రజల ఉసురు పోసుకుంటున్న కాంగ్రెస్
- మళ్లీ ఫ్లోరైడ్ రక్కసి కోరల్లోకి నల్లగొండ
- సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మరోమారు స్పష్టమైందని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా దాహార్తిని తీర్చడంతోపాటు ఆపత్కాలంలో విద్యుత్ అవసరాన్ని తీర్చే టెయిల్‌పాండ్ నీటిని ఏపీ అడ్డదారుల్లో ఖాళీ చేస్తుంటే ముఖ్యమంత్రి సహా జిల్లా మంత్రులకు సోయి లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ నిర్వాకంతో నల్లగొండ జిల్లా మరోసారి ఫ్లోరైడ్ రక్కసికి బలయ్యే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన నాలుగేండ్ల కాలంలోనే మిషన్ భగీరథ నీటితో ఫ్లోరైడ్ మహమ్మారిని పూర్తిగా తరిమికొడితే, మార్పు తెస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఫ్లోరైడ్ మహమ్మారిని తిరిగి తెప్పిస్తున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఫోర్‌ట్వంటీ హామీలిచ్చి కనీసం ఒక్కటి కూడా అమలు చేయకపోగా, పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కూడా కొనసాగించడం లేదని మండిపడ్డారు. సమైక్య నాయకుల తొత్తు ప్రభుత్వం ఇక్కడ నడుస్తున్నదని, వారికి సంతోషాన్నిచ్చేలా వీరి పాలన సాగుతున్నదని ఆరోపించారు. ఇక్కడి ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచన కొంచెం కూడా లేదని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నాయకులను నీటి చౌర్యంపై నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టెయిల్‌పాండ్ నీటి విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే మరో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, పార్లమెంట్ ఎన్నికల సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జి రాంచంద్రనాయక్, మారి పెద్ది శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

హర్షారెడ్డి స్మగుల్డ్ వాచ్‌లపై కస్టమ్స్ ఆరా?

- కోట్ల విలువైన వాచీలను ముబీన్ ద్వారా తెప్పించినట్టు గుర్తింపు
- 27న చెన్నైలో అధికారుల ఎదుట హాజరుకానున్న హర్షారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు హర్షారెడ్డి విదేశాల నుంచి కోట్లాది రూపాయల విలువైన చేతిగడియారాలను అక్రమంగా తెప్పించడంపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఇటీవల సింగపూర్ నుంచి చెన్నై వచ్చిన స్మగ్లర్ ముబీన్ ఖరీదైన 9 పటేక్ ఫిలిప్, బ్రిడ్యూట్ వాచీలను హర్షారెడ్డికి సప్లై చేసినట్టు కస్టమ్స్ అధికారులు తేల్చినట్టు తెలుస్తున్నది. ఈ వాచీల కోసం హర్షారెడ్డి క్రిప్టో కరెన్సీ తోపాటు హవాలా మార్గం ద్వారా డబ్బులు చెల్లించినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ వాచీల కోసం హర్షారెడ్డి ఇప్పటికే 2సార్లు హాంకాంగ్‌కు వెళ్లినట్టుగా అధికారులు గుర్తించడంతో ఆయనకు, స్మగ్లర్లకు ఉన్న సంబంధాలపై ఆరా తీస్తున్నారు. పటేక్ ఫిలిప్ వాచీలను అమ్మేందుకు మన దేశంలో డీలర్లు లేరు. ప్రస్తుతం మన దేశంలో బ్రిడ్యూట్ వాచీలు అందుబాటులో లేవు. ఈ నేపథ్యంలో ఆ వాచీలనే హర్షారెడ్డి ఎందుకు తెప్పించాడన్న దానిపై కస్టమ్స్ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. దీంతో హర్షారెడ్డి ఈ నెల 27న చెన్నై కస్టమ్స్ అధికారుల ఎదుట తన వాదన వినిపించనున్నారు. కాగా, ఈ వాచీల స్మగ్లింగ్‌లో మధ్యవర్తిగా వ్యవహరించిన నవీన్ కుమార్‌కు మద్రాస్ హైకోర్టు బెయిల్ తిరస్కరించింది.

శ్రీలంక వేద్దా తెగలో భారతీయ మూలాలు

సీసీఎంబీ, మరో నాలుగు సంస్థల పరిశోధనలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ): శ్రీలంకలో మైనార్టీలుగా ఉన్న వేద్దా తెగ ప్రజల్లో భారతీయ మూలాలు ఉన్నట్టు సీసీఎంబీ, మరో నాలుగు అధ్యయన సంస్థలు జరిపిన పరిశోధనల్లో వెల్లడైంది. ఐదు సంస్థల నుంచి పది మంది పరిశోధకులు శ్రీలంకలోని మైనార్టీ సమూహమైన వేద్దా జనాభా జన్యు చరిత్ర విషయాలను వెలుగులోకి తెచ్చారు. వీరిని స్థానికంగా వన్నియలేటోలుగా పిలుస్తారు. వేద్దా తెగ భాష, వ్యవహారికం, సాంస్కృతిక లక్షణాలు వైవిధ్యంగా ఉండటమే ఈ పరిశోధనకు కారణమని సీసీఎంబీ సైంటిస్ట్ డాక్టర్ కే తంగరాజ్ తెలిపారు. ఈ తెగ భారతీయులతో గణనీయమైన జన్యు సంబంధాన్ని కలిగి ఉన్నట్టు తమ ఆటోసోమల్ విశ్లేషణలో తేలిందని బీహెచ్ యూ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జ్ఞానేశ్వర్ చౌబే పేర్కొన్నారు. వీరిలో శ్రీలంకలోని సింహళీయులు, శ్రీలంక తమిళుల మూలాలు కూడా ఉన్నాయని కొలొంబో యూనివర్సిటీకి చెందిన రువాండీ రణసింగ్ చెప్పారు. ఈ పరిశోధన ద్వారా దక్షిణాసియా జనాభా చరిత్రపై మరిన్ని కోణాలు ఉంటాయని భావిస్తున్నారు. తమ పరిశోధన దక్షిణాసియావాసుల జన్యు వైవిధ్యాన్ని బాగా అర్థం చేసుకోవడానికి దోహదపడుతుందని సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి చెప్పారు.

ఎండకాలం ప్రత్యేక రైళ్లు

- ఎస్సీఆర్ ఆధ్వర్యంలో 1079 ట్రిప్పులు
- ఇండియన్ రైల్వే ఆధ్వర్యంలో 9,111..

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : ఎండకాలం దృష్ట్యా ఏప్రిల్, మేలో కలిపి దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో దాదాపు 1079 ప్రత్యేక రైళ్ల (ట్రిప్పులు)ను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇండియన్ రైల్వే ఆధ్వర్యంలోనూ దేశ వ్యాప్తంగా ప్రత్యేకంగా 9,111 ట్రిప్పులు నడుపుతున్నామని, 2023లో 6,369 ట్రిప్పులు నడిపితే ఈ సారి 2,742 ట్రిప్పులు అదనమని పేర్కొన్నారు.

ట్రాక్ పునరుద్ధరణలో రికార్డు..

2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రైల్వే ట్రాక్ పునరుద్ధరణలో దక్షిణ మధ్య రైల్వే జోన్ నెట్‌వర్క్ రికార్డు సృష్టించినట్లు అధికారులు వెల్లడించారు. ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 649 కిలోమీటర్ల మేర ట్రాక్ పునరుద్ధరణ పూర్తి చేశామని, 2022-23లో 448 కిలోమీటర్ల మేర పునరుద్ధరణ కాగా ఈ సారి 45 శాతం అధికంగా పూర్తి చేసినట్లు తెలిపారు.

జూన్ 15 వరకు ప్రత్యేక రైళ్లు

దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి జూన్ 15 వరకు ఎనిమిది ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. మైసూర్-ముజఫర్‌పూర్, బెంగళూరు-మాల్దాటౌన్, బెంగళూరు-బీదర్ మధ్య ఈ ప్రత్యేక రైళ్లు రాకపోకలు కొనసాగిస్తాయన్నారు.